


మద్దూర్ మండలకేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు

■ నరేందర్‌రెడ్డి గెలిస్తే.. సముచిత స్థానం కల్పిస్తాం..

## కాంగ్రెస్‌కు ఓటేస్తే..

# కష్టాలు గ్యారెంటీ

- ■ రైతుబంధు ఖతం కావాలా ? కాంగ్రెస్ ఖతం కావాలా ?
- ■ కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటల కరెంటుతో ముప్పతిప్పలే..
- ■ రేవంత్ కొడంగల్‌కా నై.. కామారెడ్డికా నై..
- ■ లీడర్లను కొనొచ్చు.. ఇక్కడి బిడ్డల ఆత్మగౌరవాన్ని కొనలేవు..
- ■ మద్దూర్ రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు


కొడంగల్/మద్దూర్, నవంబర్ 28 : సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగాలంటే కేసీఆరే సీఎం కావాలని, కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమైతమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ సీఎం అయ్యాకే సాధించుకున్న తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి జాతర కొనసాగుతుందన్నారు. కోట్లాది నిధులతో తెలంగాణ అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమేనని, 50 ఏండ్ల పాలనే అందుకు నిదర్శనమన్నారు. పదేండ్లు కొడంగల్ ఎమ్మెల్యేగా రేవంత్‌రెడ్డి ఉండి గుడి కట్టలేదు.. బడి కట్టలేదన్నారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులే లేరని, రేవంత్ ఏవిధంగా సీఎం అవుతాడని ప్రశ్నించారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుబంధు ఖతం, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు ఖతం చేశారన్నారు. రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3గంటల కరెంటు సరిపోతుందన్నాడని, నిజంగా సరిపోతుందా అని ప్రశ్నించారు. ఎవుసం తెలువని రేవంత్ కాబట్టే మూర్ఖంగా మాట్లాడుతున్నాడన్నారు. కర్ణాటకలో గతంలో 9 గంటల కరెంట్ ఉండగా ప్రస్తుతం 3, 4గంటలు మాత్రమే సరఫరా అవుతున్నదన్నారు. దాంతో కన్నడ ప్రజలు కాంగ్రెస్‌ను ఎందుకు గెలిపించుకున్నామా అని బాధపడుతున్నట్లు వివరించారు. కేసీఆర్ వచ్చాకే తండాలు జీపీలుగా మారాయని స్పష్టం చేశారు. 24గంటల కరెంటు, ఇంటింటికీ కృష్ణాజలాలు, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుబీమాతో తెలంగాణ అన్నపూర్ణ రాష్ట్రంగా అవతరించిందన్నారు. కాంగ్రెస్ నాయకులకు క్లారిటీ లేదని, అధికారం కోసం నోటికొచ్చిన వాగ్దానాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే పదేండ్లు వెనక్కి వెళ్తామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల కాల్వ పనులతో కొడంగల్‌లో లక్షా49వేల ఎకరాలకు సాగునీరందే సమయం దగ్గర్లోనే ఉందన్నారు. కాంగ్రెస్‌ను తప్పించి అభివృద్ధిని సాధించుకుందామని పిలుపునిచ్చారు. పట్నం నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మద్దూర్‌ను మున్సిపాలిటీగా మార్చి రోడ్డు వెడల్పుతోపాటు స్ట్రీట్ లైట్‌లతో సుందరీకరిస్తామని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా దౌల్తాబాద్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు, నియోజకవర్గంలో డివిజన్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే సీఎం కేసీఆర్ కాళ్లు పట్టుకునైనా సరే కొడంగల్‌కు ప్రమోషన్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కేసీఆర్ అంటే నమ్మకం.. విశ్వాసంగా పేర్కొంటూ కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్‌కు ఓటేసి అభివృద్ధిని అడ్డుకోవద్దని సూచించారు.

### హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారు

హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పట్నం ఐదేండ్లుగా ప్రజల మధ్య ఉంటూ కొడంగల్ అభివృద్ధికి పాటుపడినట్లు తెలిపారు. అందువల్లే ఏ గ్రామానికి వెళ్లినా ఎమ్మెల్యేకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు.

### రూ.2వేలకోట్ల నిధులు మంజూరు

గడిచిన ఐదేండ్లలో కొడంగల్ అభివృద్ధికి రూ.2వేల కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థి అందుబాటులో లేక నేడు కాంగ్రెస్ నాయకులు ఫొటోను చూపి ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌కు ప్రజల్లోకి వెళ్లే దమ్ము ధైర్యం లేక నాయకులతో ప్రచారం చేయిస్తున్నట్లు తెలిపారు. గతంలో గెలిచి హైదరాబాద్‌కు పరిమితమై భూ కబ్జాలు, బ్లాక్‌మెయిల్ దందాలతో కోట్లు గడించి, నేటి ఎన్నికల్లో ప్రజా నాయకులను కొనుగోలు చేసి గెలవాలనే కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపించారు. రేవంత్‌రెడ్డిపై పోటీ చేసేందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అవసరం లేదని, దమ్ముంటే తనపై గెలవాలని సవాల్ విసిరారు. డిసెంబర్ 30తో కాంగ్రెస్ ఎన్నికల జాతర ముగుస్తుందని, రేవంత్ హైదరాబాద్‌కు పరిమితం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ టికెట్లను రూ.10కోట్ల నుంచి రూ.50కోట్ల వరకు అమ్ముకోవడం వల్ల కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డికి రేటెంతరెడ్డి అని పేరు పెట్టారన్నారు. మరోసారి ఆశీర్వదిస్తే.. ఐదేండ్లు ప్రజలకు అందుబాటులో ఉండి, సేవకుడిలా పని చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ సలీం, మాజీ జెడ్పీటీసీ బాల్‌సింగ్, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరారెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సీ.వెంకటయ్య, సర్పంచ్ అరుణతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



మిద్దె పైనుంచి మంత్రి ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రజలు

# ఒక్క క్షణం ఆలోచించండి

- ● మహబూబ్‌నగర్‌ను అగ్రగామిగా నిలిపాను..
- ● ముస్లింలను పాకిస్తానీలతో పోల్చిన కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేద్దామా..?
- ● అన్ని కులాలను సమానంగా చూస్తున్న బీఆర్‌ఎస్‌కు వేద్దామా..?
- ● ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఎత్తుకున్న అభిమానులు

మహబూబ్‌నగర్, నవంబర్ 28 : ఓటు మీ భవిష్యత్తును తీర్చిదిద్దుతుంది.. తొందరపడి వేయకండి.. మీకూ కండ్ల ముగింట కనిపిస్తున్న అభివృద్ధిని చూసి భవిష్యత్తు తరాలకు బంగారు భవిష్యత్తును అందించేందుకు ప్రతి ఓటరు గమనించాల్సిన అవసరం ఎంతైన ఉందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం న్యూటౌన్ నుంచి క్లాక్‌టవర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్వయంగా బైక్‌ను నడిపి క్లాక్‌టవర్‌కు చేరుకుని కార్నర్ సమావేశంలో మాట్లాడారు. తక్కువ కులం అయిన నన్ను ఇబ్బందులకు గురి చేయాలని అగ్రవర్ణాల వారు కొందరూ చూస్తున్నారని, ఇది సరియైన విధానం కాదన్నారు. కుట్ర చేసి రైతుబంధును ఆపి అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ప్రతి పక్షాల కుట్రలను మహబూబ్‌నగర్ ప్రజలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. రౌడీ షీటర్లను వెనుక పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ వాళ్లు తిరుగుతున్నారని, కుల రాజకీయాలు చేస్తూ బీజేపీ నాయకులు తిరుగుతున్నారని తెలియజేశారు. ఇండియా, పాకిస్తాన్ అంటూ సంబోధించిన వ్యక్తి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారని, గతంలో ఏమి చేయకుండ ప్రజలను మభ్యపెడుతున్నారని, ప్రతి ఓటరు గమనించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. మహబూబ్‌నగర్ చుట్టు తిరిగి ఒక్కమారు చూస్తే ప్రతిపక్ష పార్టీల మెదడు పనిచేయడం లేదని, ఇలా అభివృద్ధి జరిగితే ఎలా అని వారు కుల్లుకుంటున్నారన్నారు.

### రైతులను ఇబ్బందులకు గురిచేస్తుండ్రు..

ఎన్నికల సమయంతోపాటు పంట సాగు చేసే సమయం సమీపిస్తాయని ముందుగానే కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి రైతుబంధు నిధులను అపడం జరిగిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి రైతులకు ఇబ్బందులు రానివ్వకుండ రైతుబంధు డబ్బులను జమ చేయాలని విన్నవించడంతో ఎన్నికల కమిషన్ అమోదం తెలిపిందని తెలిపారు. దీని పరిగణలోకి తీసుకున్న కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి రైతుబంధు నిధులను నిలిపినట్లు ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 3వ తేదీ తరువాత రైతుబంధు ఇస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు తన తల్లిదండ్రులపై దుర్మార్గంగా మాట్లాడుతున్నారని, ఇది ప్రజలు గమనిస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన తాను పేదల పక్షాన ఉండి పనిచేశానాని అందుకే ప్రజలంతా తనకే అండగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ కేసీ. నర్సింహులు, మూడా చైర్మన్ గంజి వెంకన్న, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ కేవీ జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ముత్యాల ప్రకాశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

### జ్యోతిబాపూలేకు ఘన నివాళి

పాలమూరు/మహబూబ్‌నగర్‌అర్బన్, నవంబర్ 28 : మహబూబ్‌నగర్ పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్ వద్ద ఉన్న జ్యోతిబాపూలే విగ్రహం వద్ద వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల ద్వారానే బీసీలు బాగుపడే అవకాశం ఉందని మొట్టమొదట చెప్పిందే పూలే అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. దేశంలో 60శాతం బీసీలకు అన్యాయం జరుగుతుందోనన్నారు. రాజకీయంగా అవకాశాలు వస్తేనే బీసీల్లో మార్పు వస్తుందని పేర్కొన్నారు. వ్యక్తిగత లాభాలు వదిలేసి బీసీల అభ్యున్నతి కోసం అందరూ కష్టపడి పనిచేయాలని కోరారు. పేదల కోసం కష్టపడి పనిచేస్తున్న తమకు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మాజీ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ బడుగు వర్గాల వారు కూడా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆయన పోరాటం చేశారని తెలిపారు. అదే విధంగా బీసీలంతా ఐక్యమంతా ఐక్యంగా ఉండి బీసీ అభ్యర్థి అయిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా మంత్రి నివాసంలో పూలే చిత్రపటానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీలకు రిజర్వేషన్లు అవసరమని తెల్చి చెప్పిన మొదటి వ్యక్తి జ్యోతిబాపూలే అని, సమాజంలో అందరికీ దూరంగా ఉన్న వ్యక్తులను అక్కున చేర్చుకోని వారికి విద్యాను అందించిన పూలే జీవితం అందరికీ ఆదర్శామని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, జేపీఎన్‌సీఈ కళాశాల చైర్మన్ రవికుమార్, బీసీ మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, జేపీఎన్‌సీ కరస్పడెంట్ రవిప్రకాశ్, కోదండపాణి, సత్యంయాదవ్, మల్లికార్జున్, ఆన్సర్ పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి